క్లుప్తంగా

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయి హారతిలో పాల్గొన్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని గూడూరులోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. శాంతి పాఠం, స్వస్తి పుణ్యహవచనం, గణేశ, నవగ్రహ మండల స్థాపన, ప్రధాన కలశ స్థాపన, స్థాపిత దేవతాహవనం, రుద్రహవనం, పూర్ణాహుతి కార్యక్రమాలను రఘురామశర్మ, రాజుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చీటి బాలకిషన్‌రావు, సువర్ణ, జెడ్పీటీసీ నర్సయ్య, జె.భాస్కర్‌రావు, గోపాల్‌రావు, దామోదర్‌రావు, సత్తయ్య, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట: పంటలకు మద్దతు ధర పెంచినందుకు స్థానిక బీజేపీ కార్యాలయంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు గురువారం క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ఆలోచించిన ప్రధాని నిర్ణయం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, నాయకులు దిలీప్, మోహన్, జింక వెంకటి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ మారవేణి రంజిత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక, పూర్తిస్థాయి ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠ్యపుస్తకాలు సమయానికి రాక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలో కనీస నిబంధనలు పాటించకుండా పాఠశాలలను నడుపుతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మలుచుకున్నాయని అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసుతులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ నాగరాజు, సామనపెల్లి ప్రశాంత్, రాజు, మధు పాల్గొన్నారు.

నీరు.. నీడ కరువు

గంభీరావుపేట: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు కరువయ్యాయి. మండుతున్న ఎండలతో కూలీలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నిప్పుల కుంపటిని తలపిస్తున్న ఎండలో కూలీలు ఎన్నో అవస్థల మధ్య పనులు చేస్తున్నారు. గంభీరావుపేట మండలంలో రోజు సుమారు రెండు వేల మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. మండలంలో 14 వేల జాబ్‌కార్డులు ఉన్నాయి.

- ఉపాధి పని ప్రదేశంలో వసతులు కరువు
- పత్తాలేని ఆరోగ్య కిట్లు
- ఎవరికీ పట్టని కూలీల అగచాట్లు



గంభీరావుపేటలో కాలువ పూడికతీత పనిలో ఉపాధిహామీ కూలీలు

వసతులు నిల్

➡ నిలువ నీడ లేక కూలీలు చెట్ల కింద సేద తీరాల్సి వస్తోంది. గతంలో నీడ కోసం టార్పాలిన్లు అందించినప్పటికీ అవి ఎప్పుడో చిరిగిపోయి అవి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు.

➡ పని చేసి అలసిపోయి దాహం తీర్చుకోవడానికి నీటి వసతి కూడా లేకుండా పోయింది. కూలీలే ఇంటి నుంచి డబ్బాలలో నీరు తెచ్చుకుంటున్నారు. పని చేసినంతసేపు అవి సరిపోకపోవడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

➡ ఊరికి దూరంగా పనులు చేపట్టడంతో కూలీలు సొంత ఖర్చులతో ఆటోల్లో పనిప్రదేశానికి వెళ్లాల్సిన వస్తోంది.

➡ పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు గాయపడినా, నీరసించి పోయినా ప్రథమ చికిత్స చేయడానికి ఆరోగ్య కిట్లు కూడా అందుబాటులో లేవు. వడదెబ్బ తగలకుండా గతంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించే వారు. ప్రస్తుతం వాటి జాడ కనిపించడం లేదు.

➡ గతంలో కూలీలకు పనిముట్లు గడ్డపారలు, పారలు, తట్టలు, కొడవళ్లు, గొడ్డళ్లు కూలీలకు ప్రభుత్వమే ఇచ్చేది. వాటిని సానబెట్టేందుకు అయ్యే ఖర్చు సైతం చెల్లించేది. ప్రస్తుతం వాటి పంపిణీకి సర్కారు స్వస్తి పలికింది.

తగ్గిన కూలీల హాజరు

గతేడాది కంటే ఈ ఏడాది పనికి వచ్చే కూలీల సంఖ్య సగానికి పడిపోయింది. తక్కువ సంఖ్యలో కూలీలు హాజరవుతున్నారు. కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పని ప్రదేశంలో సౌకర్యాల లేమి, వేతనం తక్కువగా రావడం, మండుతున్న ఎండలు ఒక కారణమైతే.. కొత్తగా తెచ్చిన ఆధునిక సాంకేతిక విధానం మరో కారణంగా చెప్పుకోవచ్చు. ఆధార్ అనుసంధానం, పని ప్రారంభించే ముందు ఒకసారి, పూర్తయ్యాక ఫొటో తీయాల్సి ఉండగా, అప్పటి వరకు కూలీలు నిరీక్షించాల్సి వస్తోందని, పని ప్రదేశంలోనే అప్‌లోడ్ చేసే విధానంతో కూలీల ఆసక్తి తగ్గిందని భావిస్తున్నారు. గ్రామాల్లో పెద్దగా పనులు కూడా లేవు. పథకంలో పంట కాలువల్లో పూడికతీత, భూమి చదును చేయడం, నీటి కుంటల నిర్మాణం వంటి పనులు మాత్రమే చేపడుతున్నారు.

నీరు తెచ్చుకుంటున్నాం



పనికి వచ్చేటప్పుడు మేము బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నాం. అవి అయిపోతే గొంతెండాల్సిందే. పని చేసే ప్రాంతం కూడా ఊరికి దూరంగా ఉండడంతో మళ్లీ నీటి కోసం వెళ్లలేని పరిస్థితి. అధికారులు స్పందించి పని ప్రదేశంలో నీటి వసతి కల్పించాలి.

– మేఘ మల్లవ్వ, కూలీ, గంభీరావుపేట

చెట్ల నీడే గతి



ఎండలో పనిచేస్తున్నాం. కాసేపు సేద తీరుదామనుకుంటే నీడ సౌకర్యం లేదు. అప్పట్లో టార్పలిన్ కవర్లతో నీడ వసతి కల్పించే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చెట్టు కింద కూర్చుంటున్నం. దెబ్బతగిలితే ప్రథమ చికిత్స చేయడానికి ఎలాంటి మందులు అందుబాటులో లేవు.

– ఈరవేని పద్మ, కూలీ

పనిముట్లు అందించాలి



ఇళ్ల నుంచే పనిముట్లు తెచ్చుకుంటున్నాం. సొంత ఖర్చులతోనే వాటిని సానబెట్టుకుంటున్నాం. గతంలో పనిముట్లు ఇచ్చి వాటిని సానబెట్టేందుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే చెల్లించేది. తిరిగి ఆ విధానాన్ని పునరుద్ధరించాలని కూలీలందరం కోరుతున్నాం.

– ఈరవేని కళావతి

చర్యలు తీసుకుంటాం



కూలీల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. తాగునీరు కూలీలే తెచ్చుకోవాల్సి ఉంది. రోజుకు రూ.5 చొప్పున వారి కూలీ వేతనంతో కలిపి ఇస్తాం. టార్పలిన్‌లు, పనిముట్ల పంపిణీ లేదు. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, గంభీరావుపేట

ఊరూరా చెరువుల పండగ

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. కట్ట మైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన రైతులు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బతుకమ్మ, బోనాలతో ఊరేగించారు. దారి పొడవునా డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలతో అలరించారు. ఊరువాడ సల్లంగా చూడు తల్లి అంటూ రైతులు వేడుకున్నారు. ముగ్గులు వేసి సుందరంగా తీర్చిదిద్దిన చెరువుల వద్ద మహిళలు బతుకమ్మ ఆట పాటలతో హోరెత్తించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, రైతుబంధు సమితి అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

– ముస్తాబాద్/వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/గంభీరావుపేట/వేములవాడరూరల్/వేములవాడఅర్బన్/కోనరావుపేట/రుద్రంగి/బోయినపల్లి



ఎల్లారెడ్డిపేట: సింగారంలో బోనాలు తీస్తున్న గ్రామస్తులు



బతుకమ్మ ఆడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



వేములవాడరూరల్: మర్రిపల్లిలో..



ముస్తాబాద్: చిప్పలపల్లి చెరువులో ముదిరాజ్ మత్స్య కార్మికులు



బోయినపల్లిలో బోనాలతో మహిళలు



గంభీరావుపేట: గజసింగవరంలో మైసమ్మకు పూజలు చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు



వీర్నపల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సమాచారం

నేడు వీబీవో ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపోలో విలేజ్ బస్సు అఫీసర్ కార్యక్రమాన్ని శుక్రవారం వేములవాడ బస్టాండ్‌లో తహసీల్దార్ నక్క శ్రీనివాస్ ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు ఆర్టీసీ మరింత చేరువవుతుందన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని వాటి విధానాలను గురించి వివరిస్తారన్నారు.

పోచమ్మ బోనాలు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మడేలేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పోచమ్మ బోనాలు తీశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తరలి వెళ్లారు. అనంతరం పోచమ్మ తల్లికి బోనాలు తీసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు గంగిపెల్లి ప్రేమ్‌సాగర్, విలాసాగర్ రజక యూత్ గౌరవ అధ్యక్షుడు పైండ్ల చందు, రజకసంఘం నాయకులు తెల్లాకుల రమేశ్, పైండ్ల మహేశ్, గంగిపెల్లి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వితరణ

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ గ్రామానికి చెందిన శేఖర్ అనారోగ్యంతో బాధపడుతుండగా సామాజిక సేవకుడు కోడూరి బాలలింగం గురువారం చిరుధాన్యాలు అందజేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్, వేముల పోశెట్టి పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లు పట్టివేత



ట్రాక్టర్‌కు నంబర్‌ను రాయించుతున్న ఎస్సై

చందుర్తి: మండలంలోని మూడపల్లి గ్రామ శివారులో నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డుపై తిరుగుతున్న 34 ట్రాక్టర్లను ఎస్సై జిల్లెల రమేశ్ గురువారం పట్టుకున్నారు. ఆర్టిస్టును పిలిపించి ట్రాక్టర్ నంబర్ ప్లేట్లను రాయించి, వదిలేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇక ముందు నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు.

సొంతఖర్చుతో చేతిపంపు ఏర్పాటు

ఇల్లంతకుంట: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గత రెండున్నరేళ్ల కాలంగా చేతిపంపు పాడై పోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత రెండు రోజుల క్రితం గొల్లపల్లి గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజల తాగునీటి గోస చూడలేక తన సొంత ఖర్చులతో చేతిపంపును బాగు చేయించి గురువారం ప్రజలకు తాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. గొల్లపల్లి గ్రామ ప్రజలు కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్ వద్దు.. ప్రభుత్వ పాఠశాల ముద్దు



కోనరావుపేట: సుద్దాలలో ర్యాలీ పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలం రాచర్లగొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, సదుపాయాలపై ముద్రించిన కరపత్రాలను సర్పంచ్ పాశం సరోజన ఆవిష్కరించారు. తల్లిదండ్రులు తమపై నమ్మకంతో వారి పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించాలని కోరారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని సుద్దాల, కోనరావుపేటలో బీడీ కార్మికుల వద్దకు వెళ్లి వారి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రావు, సీతారాం రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ఎర్రవెల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంతో పాటు చింతామని తండా గ్రామంలో ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు ప్రయివేటు పాఠశాలలో చదివే విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి, ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులను వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. కాంప్లెక్స్ హెచ్ఎం అంబటి శంకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో..



రుద్రంగిలో..

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాల్లోని కులవృత్తులు, చేతి వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తున్నందుకు గాను తెలంగాణ వీరభద్రియ వీర ముష్టికుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల మండల అధ్యక్షుడు మల్యాల దేవరాజు, కడారి అంజయ్య, అగుల్ల శ్రీనివాస్, కడారి నర్సయ్య, మల్యాల అంజయ్య పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న సంఘం సభ్యులు

'మృగశిర' సందడి

గంభీరావుపేట: మృగశిర కార్తె మొదటి రోజు చేపలు తినాలనేది ఆనవాయితీ. ఈ సందర్భంగా గంభీరావుపేటలో గురువారం చేపల మార్కెట్ క్రయవిక్రయాలతో సందడిగా మారింది. చేపలు కొనుగోలు చేయడానికి జనం ఎగబడ్డారు. గంటల కొద్ది చేపల కోసం ప్రజలు నిరీక్షించారు.



ఎంపీపీకి సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని ఎంపీపీ పడిగెల మానసను గురువారం తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ (టీజీఏ) జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంపీపీగా విజయవంతంగా నాలుగేళ్లు పూర్తి చేసుకుని పాలనలో తనదైన ముద్రను చాటారని కొనియాడారు. ఆమెకు మెమొంటో అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీజీఏ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుద్దాల మధుసూదన్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కనపర్తి జగదీశ్వర్, డివిజన్ అధ్యక్షుడు పొన్నం అఖిల్ గౌడ్, దేవేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



రంగం చెరువును కాపాడండి

- కబ్జాకు గురైన శిఖం భూమిని రైతులకు అప్పగించాలని కాంగ్రెస్ ధర్నా



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లోని రంగం చెరువు శిఖం భూములను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేస్తూ గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ రంగం చెరువు అల్మాస్‌పూర్‌తో పాటు అక్కపల్లి, దుమాల గ్రామాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 650 ఎకరాల భూమికి సాగునీరు అందిస్తుందన్నారు. కొంత మంది రైతుల వద్ద ఓ పెద్ద మనిషి శిఖం భూములు కొనడం జరిగిందన్నారు. ఈ భూములు కొన్న సదరు వ్యక్తి చెరువు కట్ట వరకు 64 ఎకరాల విస్తీర్ణంలో కబ్జా చేశారన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అన్యాక్రాంతమైన చెరువును కాపాడి గ్రామస్తులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ రైతులకు మద్దతుగా పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కే గౌస్, నాయకులు లింగంగౌడ్, సద్ది లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, విజయ్‌రెడ్డి, రాజునాయక్, బాబు, బుచ్చాగౌడ్, రాజేందర్, శ్రీనివాస్, ఇమామ్, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, రఫిక్, పోచయ్య, రాజు పాల్గొన్నారు.